క్లుప్తంగా

ఎంపీడీవోగా రంగారావు



అడ్డతీగల ఎంపీడీవోగా బాపన్నదొర నుంచి బాధ్యతలు స్వీకరించిన రంగారావు

అడ్డతీగల: అడ్డతీగల ఎంపీడీఓగా ఎంవి రంగారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పదోన్నతిపై అడ్డతీగల ఎంపీడీఓగా నియమింపబడ్డ ఆయనకి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కె.బాపన్నదొర భాద్యతలు అప్పగించారు.కె.బాపన్నదొర ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా బదిలీ అయ్యారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

చింతూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమాన్ని చింతూరు మండలంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటరత్నం బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న చట్టిలో, వచ్చేనెల 3న ముకునూరు, 5-కల్లేరు, 6-గూడూరు, 7-కుమ్మూరు, 9-చదలవాడ, 11-ఏజీకొడేరు, 13-పేగ, 16-చిడుమూరు, 18-తుమ్మలలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు సాయమందిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు

అడ్డతీగల: మండల కేంద్రానికి చెందిన మట్ట ఆంజనేయులు అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందారు. ఈ సందర్భంగా స్థానిక వినాయక తాపీ పనివారి సంక్షేమ సంఘం తరఫున భవన నిర్మాణ కార్మికులు సేకరించిన రూ.5వేల నగదును సంఘం ప్రతినిధులు పెంటారావు, ఆదినారాయణ, సురేష్‌బాబు తదితరులు మృతుడి కుటుంబానికి బుధవారం అందజేశారు. సంఘం తరఫున ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు.

మానసిక రోగులకు వైద్య పరీక్షలు



మానసిక రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గంగవరం: స్థానిక పీహెచ్‌సీలో మానసిక రోగులకు బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సంర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఓ. భావన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రతి నెల రెండో బుధవారం మానసిక రోగులకు ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ రామిరెడ్డి మానసిక రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒత్తిళ్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఆదివాసీ గ్రామ సమస్యలపై వినతి



పీవో సూరజ్ గనోరేకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

చింతూరు: ఎటపాక మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన కోరారు. ఈ మేరకు ఆమె ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేకు బుధవారం వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ వలస ఆదివాసీ గ్రామాల్లో తాగునీరు, సోలార్ లైట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుచేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- రావణాపల్లి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు విశేష స్పందన
- ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మికి ఘన స్వాగతం



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ రమేష్, నేతలు

కొయ్యూరు: అర్హతే ప్రామాణికంగా జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రావణాపల్లి సచివాలయం పరిధిలో పాత రావణాపల్లి, రేగడివీధి, తోటలూరులో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా 390 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ల కోసం పండుటాకులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. నేడు జగనన్న ప్రభుత్వ పాలనలో గ్రామ వలంటీర్ల ద్వారా ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. సంక్షేమానికి నిలువెత్తు అద్దంగా మారినా జగనన్న ప్రభుత్వాన్ని అందరూ దీవించాలని ఆమె కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని రెండోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, వైస్ ఎంపీపీలు ఎ.వెంకటరమణ, ఎ.నూకాలు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి.నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు జె.బాబులు, మండల కన్వీనర్ బి.సుధాకర్, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, జిల్లా కార్య నిర్వాహక సభ్యుడు ఎస్.సూరిబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆర్.ముసిలినాయుడు, సర్పంచ్‌లు కె.చింతల్లి, జె.రాజకుమారి, ఎస్.చంద్రరావు, ఆర్.సింహాచలం, కె.పెంటమ్మ, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.మల్లేశ్వరి, సోషల్ మీడియా కన్వీనర్ జి.అచ్చిరాజు, నేతలు వనంబాబు శ్రీను, వార్డు సభ్యులు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

మారేడుమిల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సార్ల లలిత కుమారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లలిత కుమారి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమావేశాలకు అధికారులు, ఆయా పంచాయితీల ప్రజాప్రతినిధులు సక్రమంగా రావడం లేదన్నారు. ఇక నుంచి జరిగే సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. సత్యసాయి మంచినీటి పథంకం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొన్నేళ్లుగా 5 మండలాల గిరిజన గ్రామాలకు తాగునీటిని అందుస్తున్న మంచి నీటి పథకం నీరుగారిపోతోందని పథకం నిర్వహణకు అధికారుల చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులకు తెలపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిస పర్యాటక ప్రాంతానికి వచ్చే పర్యాటకుల నుంచి వసూలు చేస్తున్న ఆదాయంపై విచారణ జరిపించాలని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. నర్సీపట్నం నుంచి మారేడుమిల్లి వచ్చే ఆర్టీసీ బస్సు గ్రామానికి శివారులో నిలిపివేస్తున్నారని దీని వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సును గ్రామంలోకి వచ్చేలా చూడాలని ఆర్టీసీ అధికారులను కోరారు. రోడ్డు మీదే పశువులు ఆవాసాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మారేడుమిల్లి మీరుగా గుడిసకు నిత్యం పర్యాటకులు వెళ్తున్నారని సీబీఈటీ అధ్వర్యంలో ఇక్కడ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొండా జాకబ్ అటవీశాఖ అధికారులను కోరారు. ఎంపీడీవో జయంతి, ఎమ్మార్వో శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ రవికుమార్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

17న వ్యాసరచన పోటీలు

జి.మాడుగుల: మండల స్థాయి వ్యాసరచన పోటీలను జి.మాడుగుల శ్రీమత్స్య మాడుగులమ్మ యూత్ అధ్వర్యంలో ఈ నెల17న నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మత్స్యరాస నారాయణ, జయసింహారాజు తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, యువత మత్తు పదార్థాలు బానిస కావటం వంటి అంశాలపై అవగాహన కల్పించటం కోసం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు, ఆసక్తి గల యువత హాజరు కావాలని వారు కోరారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి, షీల్డులను అందించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 94490034681, 8074073449, 6305141809 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

వై.రామవరం: మండలంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం పర్యటించనున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుంచి 1.30 వరకు మండలంలోని గొడుగురాయి, పులుసుమామిడి, చిన్న ఊలెంపాడు గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు, హాజరుకావాలని కోరారు.

గంగవరం : మండలంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు) గురువారం పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం 3:30 నిమిషాలకు గంగవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తారు.

సాయంత్రం 5:00 గంటలకు ఎండపల్లి రామవరం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శంకుస్థాన చేస్తారు. ప్రజాప్రతినిధులు, పాఠశాల శ్రేణులు, సచివాలయం కన్వీనర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ బాబు, సర్పంచ్ జాకబ్

మారేడుమిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, సర్పంచ్ కొండా జాకబ్ బుధవారం పరిశీలించారు. 14 నుంచి 17 సంవత్సరాలు లోపు బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, షటిల్, అథ్లెటిక్స్ పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎంఈవో తమ్మారావు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ బి.సుదర్శన రావు, హెచ్ఎం నీలయ్య, పలు పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



రాజుపేట కాలనీలో గృహసారథులకు బీమా ఆన్‌లైన్ చేయిస్తున్న దృశ్యం

వీఆర్ పురం: మండల కేంద్రంలోని రాజుపేటకాలనీలో గృహసారథులకు బీమా నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాజుపేట సచివాలయ పరిధిలో 52 మంది గృహసారథులు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల బీమా చేయించనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో బీమా ప్రక్రియ జరుగుతుందన్నారు. గృహ సారథులు సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి, అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, సర్పంచ్ వి.శారద, ఉప సర్పంచ్ ఎం.రాము, నాయకులు గౌతమ్, సచివాలయ కన్వీనర్లు చినరాజారావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, గృహసారథులు అనసూర్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



బౌడా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది



ఎటపాకలో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

చింతపల్లిరూరల్: మండలంలోని కిటుముల పంచాయతీ బౌడా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై ఐసీడీఎస్ సీడీపీవో రమణి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండల పరిషత్ సమావేశ మందిరంలో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.విజయగౌరి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పోషక విలువలున్న ఆహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్యుడు రామిరెడ్డి

గంగవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మానసిక వైద్యుడు రామిరెడ్డి మానసిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒత్తిడి, ఆందోళనకు దూరంగా ఉండాలన్నారు. మానసిక సమస్యలు ఎదుర్కొనే వారు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు సమాచారం అందజేస్తే మానసిక నిపుణులు తగిన సలహాలు ఇస్తారన్నారు. పిహెచ్‌సీ డాక్టర్ భావన, సీహెచ్ఓ మేరీ, ఆశా, ప్రిన్సిపాల్ కృష్ణ , అధ్యాపకులు శివాజీ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల అందజేత



సంతబయలులో కొత్త పింఛన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ జానకమ్మ, సర్పంచ్ శారద



జీకే వీధిలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పూర్ణిమ



చింతూరులోఇస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళీ, ఎంపీపీ అమల, సర్పంచ్‌లు నాగార్జున, కన్నారావు



మంగంపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి



గెమ్మెలిలో పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొండబాబు



ఎంపీపీ శెట్టి నీలవేణి

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు పంచాయతీ కేంద్రం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్‌లను జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ, సర్పంచ్ శారద అందజేశారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందించి ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి జగనన్న ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి జీవన్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రం పరిధిలో కొత్తగా 19 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్‌లను సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ బుధవారం అందజేశారు. సచివాలయం కన్వీనర్ నగేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని 21 సచివాలయాల పరిధిలోని 248 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీపీ శెట్టి నీలవేణి బుధవారం విలేకరులకు తెలిపారు. అనంతగిరిలో- 11, భీంపోల్-10, జీనబాడు-8, కాశీపట్నం-7, కివర్ల-2, కొత్తూరు-5, లంగుపర్తి-15, ఎన్.ఆర్.పురం- 9, పెదబిడ్డ-14, పెదకోట-23, పినకోట-21, పైనంపాడు-15, రొంపల్లి-5, టోకూరు-17, వాలసీ-8, ఎగువశోభ-14 గ్రామాల్లో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. లక్ష్మీపురం అంగన్‌వాడీ, పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యాసామర్థ్యాలను పరీక్షించారు.

చింతూరు: మండలంలోని కుమ్మూరు పంచాయతీలో కొత్తగా మంజూరైన 33 పింఛన్లను ఎంపీపీ సవలం అమలతో కలిసి ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళీ బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సర్పంచ్‌లు ఎం.నాగార్జున, కె.కన్నారావు, మండల పార్టీ కన్వీనర్ వై.రామలింగారెడ్డి, కె.కృష్ణ, నాగేశ్వరరావు, విప్లవ్‌కుమార్, మారయ్య, శ్యామల, సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని బొడ్డగండి సచివాలయం పరిధిలోని మంగంపాడు గ్రామంలో కొత్తగా 102 మందికి మంజూరైన పింఛన్లను ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమచేస్తోందన్నారు. వైస్ ఎంపీపీ ఎం.జోగిరెడ్డి, ఎంపీటీసీలు వి.సుబ్బలక్ష్మి, వి.ప్రసాదరెడ్డి, సర్పంచ్ వి.సంధ్యారాణి, కో-ఆప్షన్ సభ్యుడు ఎం.రమణ, మండల సచివాలయాల కన్వీనర్ కనకరాజు, నాయకులు శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పంచాయతీ పరిధిలో కొత్తగా 47 మందికి మంజూరైన పింఛన్లను సర్పంచ్ సీదరి కొండబాబు బుధవారం అందజేశారు. సింగర్బ పంచాయతీలో పరిధిలో కొత్తగా 15 మందికి మంజూరైన పింఛన్లను సర్పంచ్ గంగరాజు ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ , గడుతూరులో 20 మందికి కొత్త పింఛన్లను సచివాలయ కన్వీనర్ చంద్రపతి, వెల్ఫేర్ అసిస్టెంట్ నీలకంఠం పంపిణీ చేశారు.

తప్పని వెతలు



కాలువ దాటుతున్న కుమ్మరివీధి విద్యార్థులు

గూడెంకొత్తవీధి: వర్షాకాలంలో గెడ్డ దాటలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రింతాడ పంచాయతీ చాపగెడ్డ పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుతున్నారు.వారిలో 15 మంది విద్యార్థులు పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుమ్మరివీధి నుంచి రావాలి. మధ్యలో కాలువ ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల కాలువ ఉధృతి కావడంతో విద్యార్థులు దాటేందుకు అవస్థలు పడుతున్నారని, ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలువపై వంతెన లేదా కల్వర్టును నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు వినతి



తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని ఐదు పోలింగ్ కేంద్రాలను సమీపంలో ఉన్న పాఠశాలల్లోకి మార్చాలని పలు పార్టీల నాయకులు బుధవారం తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారికి వినతిపత్రం అందజేశారు. రాజవొమ్మంగిలోని నెంబర్-72, గొబ్బిలమడుగు లోని-87వ పోలింగ్ కేంద్రం, అమీనాబాద్‌లో-92, వంచంగిలోని-150, ఓగిపాలెంలోని-156వ పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్నట్టు వినతిలో పేర్కొన్నారు. ఓటర్లు పెరిగిన నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాలను సమీపంలోని పాఠశాలల్లోకి మార్చాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు తదితరులు కోరారు.

బురదలో కూరుకుపోయిన బస్సు

ట్రాఫిక్‌కు అంతరాయం



కూరుకుపోయిన బస్సు

రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ సమీపంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిపై బుధవారం 30 మంది ప్రయాణికులతో ఏలేశ్వరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో కూరుకుపోయింది. దీంతో కొంతసేపు రాజవొమ్మంగి- ఏలేశ్వరంల మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. హైవే నిర్మాణ అధికారులు, సిబ్బంది స్పందించి, పరిస్థితిని చక్కదిద్దడంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

పశువులకు టీకాలు



పశువులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

పెదబయలు: మండలంలోని కిలగాడ పశువైద్య కేంద్రం పరిధిలోని బాబుశాల పంచాయతీ బొరగం గ్రామంలో బుధవారం పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని వైద్యాధికారి సౌజన్యదేవి అధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో 98 పశువులకు టీకాలు వేశారు. 48 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమానికి. పశువుల సంరక్షణకు కృషి చేస్తోందన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని. పశువుల శాలలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. సిబ్బంది రఘునాథ్, రఘురాం, అంజి తదితరులు పాల్గొన్నారు.